క్లుప్తంగా

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం



వలంటీర్లకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోపాల్ నాయక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా పర్యావరణ పరిరక్షణ, గ్రామాల పరిశుభ్రత, మొక్కల పెంపకం తదితర సేవా కార్యక్రమాలు చేసిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సర్టిఫికెట్లు అందించారు. అనంతరం కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ సమావేశం

నల్లచెరువు: తలమర్ల వాండ్లపల్లి సచివాలయం పరిధిలోని రేషన్ షాపులకు సంబంధించిన విజిలెన్స్ కమిటీ మెంబర్ల ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. రేషన్ కార్డులకు సంబంధించిన సమస్యలపై చర్చించారు. రేషన్ కార్డుల్లో కొత్తగా మార్పులు చేర్పులు ఉంటే సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణప్ప నాయుడు, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ ఓబులేశు, రేషన్ షాపు డీలర్లు పాల్గొన్నారు.

కామాంధులను శిక్షించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

కదిరి టౌన్: చిత్తూరు జిల్లాలో వడ్డెర ఆడబిడ్డపై హత్యాచారానికి పాల్పడిన నలుగురు కామాంధులను కఠినంగా శిక్షించాలని వడ్డెర సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో సోమవారం కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. కామాంధులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో వడ్డెర్ల సంఘం నాయకులు గోవర్ధన్, అంజనేయులు, ప్రసాద్, హరిప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు.

రేపు నరసంపల్లిలో అధికారుల పర్యటన

కనగానపల్లి: మండలంలోని నరసంపల్లి గ్రామంలో బుధవారం మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటిస్తారని ఈఓఆర్డీ అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చిస్తారన్నారు. స్థానిక సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అందుబాటులో ఉండాలన్నారు.

వినతిపత్రం సమర్పణ



జకియా ఖానంకు వినతిపత్రం సమర్పిస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

కదిరి అర్బన్: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం కదిరి పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి విచ్చేసిన శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానంకు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను శాసనమండలి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఆ సంఘం నాయకులు అత్తార్‌మహబూబ్‌బాషా, మునీర్, వెంకటేష్, నౌషాద్,హిదయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలు



రాఘవంపల్లిలో పంటకోత ప్రయోగాలను పరిశీలిస్తున్న రమేష్

బత్తలపల్లి: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంటలో దిగుబడి అంచనా నిమిత్తం పంటకోత ప్రయోగాలను అధికారులు నిర్వహించారు. సోమవారం మండలంలోని రాఘవంపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 16–ఈ టికే క్రిష్ణయ్య పొలంలో పంటకోత ప్రయోగాలను జిల్లా గణాంకశాఖ అధికారి రమేష్ పర్యవేక్షణలో 5''5 విస్తీర్ణంలో నిర్వహించగా దిగుబడి కేజీ 775 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మ, వీహెచ్ఏ సత్యనారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్పెషలిస్టు వైద్యమందిస్తాం రండి!

- నేడు జగరాజుపల్లెలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' మాక్ క్యాంపు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



జగరాజుపల్లిలో వృద్ధునికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

పుట్టపర్తి అర్బన్: 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే జోరుగా సాగుతోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఆదేశాల మేరకు పుట్టపర్తి మండలం జగరాజుపల్లి గ్రామంలో మంగళవారం మాక్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. వారం రోజుల్లో టోకెన్లు అందజేసిన వారందరికీ వైద్య సేవలు అందిస్తామన్నారు. శిబిరంలో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు, ఫ్యామిలీ ఫిజీషియన్, డీఎంహెచ్ఓ, ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల స్పెషలిస్ట్ వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, స్టాఫ్ నర్సులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొంటారని చెప్పారు.

బృహత్కార్యం..

జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట రాష్ట్ర ప్రభుత్వం బృహత్కార్యానికి శ్రీకారం చుట్టింది. కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్నారు. ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు మెడికల్ కిట్ చేతపట్టుకుని ప్రతి ఇంటికీ వెళ్లి అందరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. రక్త నమూనాలను తీసి మొత్తం 7 టెస్టులు చేస్తున్నారు. రక్తపోటు, మధుమేహం, మూర్ఛ, కేన్సర్, గుండెజబ్బులు, నరాల జబ్బులు వంటివి ఏమైనా ఉన్నాయా అని ఆరా తీస్తున్నారు. అలాంటి వారిని నమోదు చేసుకుని టోకెన్ అందజేస్తున్నారు. టోకెన్ పొందిన వారు ఈనెల 30 నుంచి గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరానికి వెళ్లి ఉచితంగా మందులు తీసుకోవచ్చు. అయితే, జగరాజుపల్లిలో ముందుగానే మాక్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. టోకెన్లు పొందిన వారిని ఇందులో మళ్లీ పరీక్షించి బీపీ, షుగర్‌కు నెలకు సరిపడా మందులు, ఆరోగ్యం సరిగా లేని వారికి ఉచితంగా మందులు అందజేస్తారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ప్రతి వైద్య శిబిరంలో ఇద్దరు చొప్పున స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉంటారు. ఈ సందర్భంగా సిబ్బంది కుటుంబంలోని ఒకరి సెల్‌ఫోన్లో ఆరోగ్య సురక్ష యాప్ డౌన్‌లోడ్ చేస్తారు. ఇకపై క్రమం తప్పకుండా మందులు అందిస్తారు.

క్యాంపు ఏర్పాట్లు పూర్తి

'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం మాక్ క్యాంపు జరగనున్న జగరాజుపల్లిలో సోమవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. వైద్య బృందం మంగళవారం రోజంతా గ్రామంలోనే ఉంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, ప్రత్యేకాధికారి సుభదాస్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, వైద్యాధికారి నాగరాజు నాయక్, కృష్ణయ్య, జిల్లా ప్రజారోగ్య అధికారి వీరమ్మ, ఈఓఆర్డీ అశోక్‌కుమార్ రెడ్డి, సీహెచ్ఓ నగేష్ తదితరులు ఉన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'పై ఇంటింటి సర్వే



పర్వతదేవరపల్లిలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల నోడల్ అధికారి త్రిలోకనాథ్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది మామిళ్లపల్లి, పర్వతదేవరపల్లి గ్రామాల్లో పర్యటించి ఇంటింటి సర్వే చేపట్టారు. కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసురేని అనారోగ్యంతో ఉన్న వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, చిన్న పిల్లల వివరాలను నమోదు చేసుకున్నారు. ఎలకుంట్ల, మద్దెలచెరువు, దాదులూరు, కేఎస్ పాళ్యం సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో కూడా సర్వే చేస్తున్నట్లు నోడల్ అధికారి తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం కింద ఈ నెల 30 నుంచి గ్రామాల వారీగా హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, పలువురు హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

2వేల మందికి ఉద్యోగాలెక్కడిచ్చారు?

- మాజీ మంత్రి పరిటాల సునీతపై మండిపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రామగిరి: మండలంలో స్కిల్ డెవలప్‌కింద రెండువేల మందికి శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు ఇచ్చామని మాజీ మంత్రి పరిటాల సునీత చెప్పడంలో ఏమాత్రం నిజం లేదని రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమశాఖ యువజన శిక్షణ కేంద్రంలో ఎంపీపీ మజ్జిగ అంజలి, మూడు మండలాల కన్వీనర్లు రమేష్, అమర్‌నాథ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, జెడ్పీటీసీలు గోసేనాగార్జున, మైలారపు గోవిందరెడ్డి విలేకరులతో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో మంత్రిగా పనిచేసినా.. దోచుకొని, దాచుకోవడానికే సరిపోయిందన్నారు. బడుగు, బలహీనవర్గాలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. 2019 జనవరిలో గిరిజన యువజన సంక్షేమ కేంద్రం ఏర్పాటు చేసి, శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించామని చెప్పడంలో వాస్తవం లేదన్నారు. అదే ఏడాది ఫిబ్రవరిలోనే ఎన్నికల కోడ్ వచ్చిందని, అనంతరం వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిందన్నారు. ఆరునెలలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో స్థానికంగా (వీఎల్ఎస్ఐ, ఎలక్ట్రానిక్స్) వెరిలాడ్జ్ స్కిల్ ఇంటిగ్రేషన్ కింద విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. స్కిల్‌స్కాంలో టీడీపీ అధినేత జైలు పాలుకావడంతో టీడీపీ నాయకులకు మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం 20 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించగా, తమ ప్రభుత్వంలో 4లక్షల మందికి పైగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. ప్రస్తుతం టీడీపీ నాయకులు చేపట్టిన నిరాహార దీక్షలకు కార్యకర్తలు రాకపోగా, ఇలా అసత్య వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మీనుగ నాగరాజు, సిద్దన్న, నాయకులు గంగుల సుధీర్‌రెడ్డి, నరసింహారెడ్డి, కుర్రా హనుమంతరెడ్డి, పోలేపల్లి సూరి, రామాంజనేయులు, నర్సిరెడ్డి, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

అవయవదానం చేయండి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: ఆపద సమయంలో అవసరమైన వారికి అవయవదానం చేయడం ద్వారా మరో జన్మ పొందినట్లేనని, ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో ఆయుస్మాన్ భవ–ఆర్గాన్ డొనేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి మాట్లాడుతూ అవయవదానం అనంతరం మనం ఇంకో తరం జీవించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ అవయవ దానంపై అవగాహన పెంచుకోవాలని ప్రతిజ్ఞ చేసి ఆన్‌లైన్ అంగీకార పత్రాన్ని పొందాలన్నారు. డీపీఎం డాక్టర్ కేసీ కుల్లాయప్ప నాయక్ మాట్లాడుతూ దాదాపు అన్ని జంతువులూ మరణానంతరం ఏదో ఒక విధంగా ఉపయోగపడుతున్నాయన్నారు. మనుషులు సైతం విలువైన అవయవాలను దానం చేసి జీవితాన్ని సార్థకం చేసుకోవాలన్నారు. అవయవ దానం చాలా మంచి కార్యక్రమమని దీనిపై అవగాహన కల్పించిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ప్రిన్సిపాల్ డాక్టర్ సెంథిల్‌కుమార్ కృతజ్ఞతలు చెప్పారు.

అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు

బత్తలపల్లి: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందనలో ప్రజల నుంచి అందే అర్జీలను నిర్లక్ష్యం చేయవద్దని తహసీల్దార్ యుగేశ్వరిదేవి పేర్కొన్నారు. స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించారు. ఇందులో ఆరు అర్జీలు అందినట్లు తెలిపారు. భూ సమస్యలపై ఐదు, సర్వే కోసం ఒక అర్జీ చొప్పున అందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సౌజన్యకుమారి, ఏపీఓ ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఇంజినీర్ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ, ఏఓ ఓబిరెడ్డి, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య, ఇతర అధికారులు హాజరయ్యారు.

ఉప్పర్లపల్లి చెరువుకు నీరు విడుదల



గేట్ తెరుస్తున్న నాగేశ్వరరెడ్డి, బయపరెడ్డి

బత్తలపల్లి: మండలంలో ప్రవహిస్తున్న చిత్రావతి నది నుంచి ఉప్పర్లపల్లి చెరువుకు నీటిని విడుదల చేశారు.మండలంలోని సంఘమేశ్వర క్షేత్రం సమీపంలోని చిత్రావతి నదిపై ఆర్డీటీ సహకారంతో రోడ్డు కమ్ బ్రిడ్జి నిర్మించారు. ఇక్కడ ఉప్పర్లపల్లి చెరువుకు నీరు వెళ్లేందుకు పూర్వం నుంచి కట్టుకాలువ ఉంది. బ్రిడ్జి నిర్మాణంతో అక్కడ గేటు ఏర్పాటు చేశారు. గత రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో చిత్రావతి నది ప్రవహిస్తోంది. దీంతో నీరు డ్యాంకు వెలుతోంది. ఇది గమనించిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి ఆర్డీటీ అధికారులను సోమవారం ఆహ్వానించి నీరు విడుదల చేశారు. ఆర్డీటీ డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి, ఇంజినీర్ మురళితో పాటు బయపరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణరెడ్డి, లింగమయ్య, రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాధవరెడ్డితో పాటు పలువురు రైతులు పాల్గొని ఉప్పర్లపల్లి చెరువుకు వెళ్లే కాలువకు ఏర్పాటు చేసిన గేట్‌ను తెరిచి నీటిని విడుదల చేశారు. దీంతో జ్వాలాపురం, కోడేకండ్ల, రామాపురం తదితర గ్రామ పొలాల్లో కూడా భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందని రైతులు తెలిపారు.

వీహెచ్ఏల క్రమబద్ధీకరణ ఆపాలి



జిల్లా ఉద్యానశాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్ఏలు

పుట్టపర్తి అర్బన్: ఉద్యానశాఖకు అనుబంధంగా సచివాలయాల్లో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు (వీహెచ్ఏ)గా పని చేస్తున్న తమను క్రమబద్ధీకరణ పేరుతో ఇతర జిల్లాలకు బదిలీ చేయడన్ని ఆపాలని వీహెచ్ఏలు జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. సోమవారం జిల్లాలోని వీహెచ్ఏలు పుట్టపర్తికి విచ్చేసి వినతి పత్రం అందజేసి విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి రేషనలైజేషన్ చేస్తున్నట్లు ఆర్డర్స్ వచ్చాయని, ఇవి తమకు ఇబ్బందిగా ఉన్నాయన్నారు. తమ స్థానాలను యథావిధిగా కొనసాగించేలా చూడాలని కోరారు. రేషనలైజేషన్ చేయడం ద్వారా జిల్లాలోని 173 వీహెచ్ఏ ఉద్యోగాల్లో 77 కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం అందుకున్న డీహెచ్ఓ చంద్రశేఖర్ సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులకు పంపుతానని చెప్పారు.

పెరిగిన ఆక్రమణలు.. తప్పని ఇబ్బందులు



అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ వర్షపు నీరు



తడిసిన సరుకులను బయటకు వేస్తున్న సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం ప్రశాంతిగ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోకి నీరు రావడంతో తీవ్ర నష్టం వాటిల్లినట్లు కేంద్రం కార్యకర్త నర్మద తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. సత్యసాయి ఎయిర్‌పోర్టు సమీపంలోని ప్రభుత్వ స్థలంలో సుమారు 6 ఏళ్ల క్రితం కేంద్రాన్ని నిర్మించారు. అప్పట్లో సదరు స్థలం చుట్టూ అంతా ఖాళీగా ఉండేది. ఇటీవల ప్రభుత్వ స్థలాన్ని కొంత మంది ఆక్రమించుకుని ఎత్తు చేసి ఇళ్లు, కార్యాలయాలు నిర్మించుకున్నారు. నాలుగు రోజులు భారీ వర్షాలు కురవడంతో ఎయిర్‌పోర్టు నీళ్లు, పైభాగాన వంకల్లోని నీళ్లన్నీ అంగన్‌వాడీ కేంద్రంలోకి చేరాయి. సోమవారం వెళ్లి చూడగా కోడిగుడ్లు, బియ్యం బస్తాలు, వైఎస్సార్ కిట్లు, రాగిపిండి తదితర సరుకులు అన్నీ తడిసిపోయాయి. అధికారులు కేంద్రాన్ని బాగు చేయాలని పలువురు కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

ధర్మవరం అర్బన్: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి ఆయుబ్‌ఖాన్, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ రమణ, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు చంద్రకళ, సరస్వతిలు కోరారు. స్థానిక సీడీపీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని, 62 సంవత్సరాలకు సర్వీసును పెంచాలని, కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వేతనాలు వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం సీడీపీఓ లక్ష్మికి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో..

కదిరి టౌన్: అంగన్వాడీ కార్యకర్తలు కదిరి సీడీపీఓ ప్రాజెక్ట్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని సీడీపీఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జీఎల్.నరసింహులు, జగన్మోహన్, ముస్తక్ అలీ, నాయకురాలు మాబున్నీసా, సుశీల, సుజాత, సువర్ణ, సరోజ, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల కేంద్రంలోని వేమన పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలపై సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.

తెరిపివ్వని వరుణుడు



జగరాజుపల్లి వద్ద వేరుశనగ పంట తొలగించి పొలంలోనే వదిలేసిన రైతు పెద్దరంగారెడ్డి

పుట్టపర్తి అర్బన్: నాలుగు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తుగా సాగు చేసిన పంటలను తొలగించి రోడ్లపై ఆరబోశారు. రోజూ భారీ వర్షాలు కురుస్తుండడంతో కప్పిన టార్పాలిన్‌లు సైతం గాలికి కొట్టుకుపోతున్నాయని రైతులు వాపోతున్నారు. మంచి దిగుబడులు వచ్చినా వర్షాలకు గిట్టుబాటు ధరలు వస్తాయో లేదోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టమాట తోటలోకి వర్షపు నీరు

తాడిమర్రి: మండలంలోని దాడితోట గ్రామంలో గద్దె అమర్‌నాథ్‌రెడ్డి అనే రైతు టామాట తోటలోకి భారీగా వర్షపు నీరు చేరింది. వారం పది రోజుల్లో పంటకోత కోయాల్సి ఉండగా గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున, సోమవారం తెల్లవారు జామున కురిసిన ఓ మోస్తరు వర్షాలకు వర్షపు నీరు తోటలోకి చేరింది. దీంతో సుమారు రెండు ఎకరాల పంట నీటిలో మునిగిపోయింది. నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

సిమెంట్ రోడ్డు పనుల ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

నల్లచెరువు: మండల పరిధిలోని ఉప్పార్లపల్లి గ్రామంలో రూ.15లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సిమెంటు కాంక్రీటు రోడ్డు పనులను సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు పోలం మాధవరెడ్డి, సూర్యశేఖర్‌రెడ్డి, పి.బావాఖాన్, 10వ వార్డు మెంబర్ నాగరాజు భూమి పూజ చేసి ప్రారంభించారు.వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించినప్పుడు సిమెంట్ రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆమేరకు రూ.15 లక్షలు విడుదల చేయించారని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పోలం సిద్దారెడ్డి, బావుద్దీన్‌ఖాన్, ప్రభాకర్‌రెడ్డి, మహబూబ్ బాష, రామన్న, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



నగదు అందిస్తున్న నాయకులు

నల్లమాడ: మండలంలోని చెరువువాండ్లపల్లికి చెందిన కె.రామాంజినేయులు(40) అనారోగ్య సమస్యలతో మూడు రోజుల క్రితం మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ. 10 వేలను సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు చేతుల మీదుగా మృతుని భార్య శ్యామలకు అందజేశారు. ఎంపీటీసీ శివారెడ్డి, యూత్ విభాగం మండల అధ్యక్షుడు కోనపల్లి నరసింహారెడ్డి, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు చిన్నాదేవి, నాయకులు కొక్కంటి సాంబశివారెడ్డి, సుధాకర్ రెడ్డి, దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి, అంజి తదితర నాయకులు, సచివాలయ ఉద్యోగి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది



హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని శాంతి ఆనంద పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న జిల్లా కేంద్రంలో నిర్వహించిన యోగా పోటీల్లో ఏడు మంది విద్యార్థులు జిల్లా స్థాయిలో రెండవ, మూడో స్థాయి బహుమతులను సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ సోమవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైన వారిని ఎంఈఓ వెంకటరమణ, పాఠశాల సిబ్బంది తదితరులు అభినందించారు.

హ్యాండ్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు..

నల్లమాడ: హ్యాండ్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు స్థానిక పాత బాలాజీ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ హనీఫ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో అండర్–17 బాలికల విభాగంలో నందిని, అండర్–14 బాలుర విభాగంలో వంశీ, ప్రశాంత్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ పోలే వెంకటరెడ్డి, కరస్పాండెంట్ స్వర్ణలత, ఉపాధ్యాయులు అభినందించారు.

దోబీఘాట్ నిర్మాణానికి నిధులు కేటాయించాలి

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో విఠలరాయుని చెరువు వద్ద దోబీఘాట్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఏపీ రజక సంఘం ఆధ్వర్యంలో పలువురు రజకులు సోమవారం ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ విఠలరాయుని చెరువు వద్ద గతంలో 1701 సర్వే నంబర్‌లో 72 సెంట్ల స్థలం ప్రభుత్వం కేటాయించిందన్నారు. దోబీఘాట్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఏపీ రజక సంఘ రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు రవి, నాగభూషణ, నాగేంద్రతో పాటు పలువురు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని కామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మల్లిఖార్జున(30)అనే వ్యక్తి గత కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేక ఎక్కడ బడితే అక్కడ తిరిగుతుండేవాడు. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి పోయి గ్రామం వెలుపల మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. సోమవారం గొర్రెల కాపరులు మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు అవివాహితుడు.